# ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన బెల్లంపల్లి, కన్నెపల్లి, భీమిని, మందమర్రిలో మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు, గోడ గడియారాలు, వీడియో గ్రఫీ విధిగా ఉండాలని సూచించారు. అభ్యర్థుల అఫిడవిట్లు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బెల్లంపల్లి ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, కన్నెపల్లి, భీమిని ఎంపీడీవోలు గంగామోహన్, శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు బికర్ణదాస్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మందమర్రిలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను కలెక్టర్ సందర్శించారు.

**సమయపాలన పాటించాలి**

విధుల్లో సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. కన్నెపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించిన సమయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు సిబ్బంది హాజరు కాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజిష్టర్లు పరిశీలించారు. ఎంపీడీవోకు ఫోన్ చేసి ఆలస్యంపై ఆరా తీశారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన సహస్ర

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ప్రాంతానికి చెందిన పాలచెట్టు తాటికొండ రవికుమార్ స్రవంతి దంపతుల కూతురు తాటికొండ సహస్ర ఎ కేటగిరీ లో ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించింది. సిద్దిపేట సురభి ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్స్ వైద్య కళాశాలలో సీటు దక్కించుకుంది. బుధవారం కాళోజి నారాయణ రావు వైద్య విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కౌన్సి లింగ్ లో నీట్ పరీక్షలో 4796 ర్యాంక్ సాధించి ఉచిత సీట్ సాధించింది. ఉచిత సీట్ సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఉచిత ఎంబిబిఎస్ సీట్ సాధించిన సహస్ర తండ్రి ఆర్ఎంపీ వైద్యునిగా పట్టణం లో సేవలందిస్తుండగా కూతురు ఎంబీబీఎస్ సీట్ సాధించడంతో పట్టణంలోని పలువురు ఆర్ఎంపీ లు సహస్ర ను అభినందించి ఉత్తమ వైద్యురాలిగా పేరు సంపాదించి ప్రజలకు వైద్య సేవలందించాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తెలంగాణ మోడల్ స్కూల్ మంచిర్యాల విద్యార్థులు అసాద్, శ్రీమన్ ఎంపికయ్యారని పిడి ఎన్. సుదీప్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో ఎస్‌జిఎఫ్ యూ–19 బాలుర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాజీవ్ నగర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ రెండవ సంవత్సరం ఎంఫిసీ చదువుతున్న విద్యార్థులు అసాద్, శ్రీమన్ ప్రతిభ కనబరిచారు. మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ముత్యం బుచ్చన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# 'వేపచెట్టు తొర్రలో మర్రి'

**మర్రి మొక్కలు ఇతర చెట్ల కొమ్మలలో మొలకెత్తడం సాధారణం. వేప చెట్టులో మర్రి మొలవడం చాలా అరుదు. మర్రి పళ్లు తినే పక్షుల చేత మర్రి చెట్టు విత్తనాలు ఇతర ప్రదేశాలకు వెదజల్లబడతాయి. ఇలా వేరే చెట్టుమీద పడి, దాని పగుళ్ళలో మొలకెత్తిన మొక్కల వేళ్లు క్రమంగా భూమికి ప్రాకి, కొమ్మలు ఆకాశంవైపు విస్తరిస్తాయి. గంగాధర మండలం గట్టుభూత్కూర్‌కు చెందిన ట్రాక్టర్ ఎల్లయ్య ఇంటి పరిసరాల్లోని వేపచెట్టులో మర్రిచెట్టు మొలిచింది. వారి ఇంటి ముందు నుంచి వెళ్లే వారు వేప చెట్టులో మర్రి మొలకను వింతగా చూస్తున్నారు.**

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**



# కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

- **ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డు చేరాలే**
- **చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ మోసమని, ఆ పార్టీ బాకీ కార్డులు ఉద్యమంలా ఇంటింటికీ పంపిణీ చేయాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. బుధవారం నస్పూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల దిశానిర్దేశం చేస్తూ, కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికే టికెట్లు కేటాయిస్తామని ప్రకటించారు. కొత్తగా పార్టీలో చేరేవారికి అవకాశం ఉండదన్నారు. బాల్క సుమన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఏవీ అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణ మాఫీ, బోనస్, నిరుద్యోగులకు భృతి — అన్నీ బాకీ పడ్డాయని తెలిపారు. కాంగ్రెస్ బాకీలను కార్డుల రూపంలో ప్రజలకు అందించి మోసాలను వివరించాలని సూచించారు. కేసీఆర్ అప్పు చేసి రాష్ట్రానికి రూ.50 లక్షల కోట్ల విలువైన సంపద సృష్టించారని, కాంగ్రెస్ మాత్రం 22 నెలల్లో రూ.2.5 లక్షల కోట్లు అప్పు చేసి ఏ అభివృద్ధి చేయలేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు, రోడ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మెడికల్ కాలేజీలు, రైతు వేదికలు ఇవన్నీ కేసీఆర్ హయాంలో జరిగాయని గుర్తుచేశారు. మంత్రి వివేక్ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని, తాము తెచ్చిన నిధులను కూడా రద్దు చేయించారని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు లేక, రైతులకు యూరియా కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమేనని, ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయమని ఆయన స్పష్టం చేశారు. చెన్నూర్‌లో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు.



# కాంగ్రెస్ గ్యారంటీలు అబద్ధం

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు** ▪ **బాకీ కార్డుల పంపిణీ**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డు నిజం, కాంగ్రెస్ గ్యారంటీలు అబద్ధమని పేర్కొన్నారు. ప్రజలందరూ నిజం వైపు నిలబడి బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని విజిత్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు.బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆదేశాల మేరకు హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హాజీపూర్ మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, పెద్దంపేట మాజీ ఎంపిటీసీ జాడి వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న సైన్స్ డ్రామా పోటీలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లా సైన్స్ సెంటర్‌లో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు ఆకట్టుకున్నాయి. బెంగళూరు విశ్వేశ్వరయ్య టెక్నాలజీ మ్యూజియం ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయిలో జరిగే సైన్స్ డ్రామా పోటీలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మానవాళి సంక్షేమానికి శాస్త్ర సాంకేతికత అనే ప్రధాన అంశంతో పాటు సైన్సులో మహిళలు, స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఇండియా, అందరికీ పరిశుభ్రత, గ్రీన్ టెక్నాలజీ వంటి ఉపాంశాలపై విద్యార్థులు సైన్స్ డ్రామాలను ప్రదర్శించారు. జిల్లాలోని పది పాఠశాలల నుండి 80 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్మెల్ హై స్కూల్ విద్యార్థులు మొదటి స్థానాన్ని సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యంపల్లి విద్యార్థులు రెండో స్థానంలో, స్లేట్ హై స్కూల్ జన్నారం విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. విజేత బృందం హైదరాబాదులో అక్టోబర్ 17, 18 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాను ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ రావు, సెక్టరల్ అధికారి చౌదరి, నస్పూర్ మండల విద్యాధికారి పద్మజ, జడ్జిలుగా కొండు జనార్ధన్, రాజన్న, అర్చన పాల్గొన్నారు. సహాయకులుగా సి. శ్రీనివాస్ సేవలందించారు. సైన్స్ డ్రామాలు శాస్త్ర సాంకేతికతను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఎంతో దోహదం చేస్తాయని జిల్లా విద్యాధికారి యాదయ్య చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు గౌరవం తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లతో కచ్చితమైన బిల్లింగ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



**ఎస్ఈ ఉత్తమ్ జాడే**

హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులకు బిల్లుల అందజేత వేగవంతం, మరింత పారదర్శకతతో జరగేందుకు 'ఆటో మేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్)' వ్యవస్థను అమలు చేస్తున్నామని మంచిర్యాల సర్కిల్ సూపరిం టెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ఉత్తమ్ జాడే తెలిపారు. మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు తక్కువగా ఉండేందుకు ఈ సాంకే తికం కీలకం అని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లో అధిక సామర్థ్య విద్యుత్ వినియోగించే పరిశ్రమల్లో ఈ సిస్టాన్ని ప్రయోగాత్మకంగా అమర్చడం ప్రారంభమైందని, దాంతో మీటర్ రీడింగ్స్ సేకరణలో తప్పులు తక్కువగా ఉంటాయని వివరించారు. విద్యుత్తు సరఫరాలో వచ్చే ఏదైనా హెచ్చుతగ్గులను వెంటనే గుర్తించవచ్చని, సిబ్బంది సమయం వృధా కాకుండా ఉందని తెలిపారు. హెచ్‌టీలో 55 హెచ్‌పీకి పైగా సామర్థ్యం ఉన్న వినియోగదారుల రీడింగ్స్‌ను ఏడీఈ స్థాయి అధికారి, 55 హెచ్‌పీ వరకు ఉన్నవాటిని ఏఈ స్థాయి అధికారి సేకరిస్తారు. నాన్ స్లాబ్ రీడింగ్‌లను లైన్ ఇన్స్పెక్టర్లు, స్లాబ్ రీడింగ్‌లను ప్రైవేట్, జూనియర్ లైన్ మెన్లు సేకరిస్తారు. ఏఎంఆర్ స్మార్ట్ మీటర్ సిస్టం ద్వారా విద్యుత్ వినియోగాన్ని కొలుస్తుందని, 4జీ కమ్యూనికేషన్ సిమ్ ద్వారా డేటా నేరుగా హనంకొండలోని సెంట్రల్ సర్వర్‌కు చేరుతుందని, మానవ ప్రమేయం లేకుండా 30 రోజుల్లో ఖచ్చితమైన బిల్లింగ్ పూర్తి అవుతుందని ఆయన చెప్పారు. అనంతరం మంచిర్యాల సర్కిల్‌లో ఆర్.కే ఫుడ్స్ ఇండస్ట్రీస్ హెచ్‌టీ మీటర్‌కు ఆటోమేటిక్ మీటర్ రీడర్‌ను అమర్చారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎంఆర్టీ రాజన్న, డీఈ ఆపరేషన్ ఖైసర్, ఏడీఈ హెచ్‌టీ మీటర్స్ రాంచందర్, ఏడీఈ టౌన్ వేణుగోపాల్, ఏఈ -వన్ టౌన్ మల్లేష్, ఏఈ హెచ్‌టీ మీటర్స్ రవళి, అనలాజిక్ ప్రాజెక్ట్ ఇంజనీర్, వినియోగదారు ఎం. హనుమంతరావు పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో భర్త మృతి

- **ప్రాణాపాయ స్థితిలో భార్య.. హాస్పిటల్లో చికిత్స**

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

పిల్లలు లేక ఒంటరిగా జీవిస్తున్న వృద్ధ దంపతుల్లో ఒకరు అనుమానాస్పదంగా మృతిచెందగా మరొకరు ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలం గర్శకుర్తికి గజ్జెల శంకరయ్య (75), గజ్జెల లక్ష్మి (70)కి సంతానం లేదు. ఒంటరిగా ఉంటున్నారు. మంగళవారం ఉదయం శంకరయ్య మటన్ దుకాణానికి వెళ్లి బోటి తీసుకొచ్చి ఇంటిబయట క్లీన్ చేస్తూ అతని భార్య అన్నం వండుతూ వంట రూంలో అనుమానాస్పదంగా పడి ఉన్నారు. సాయంత్రమైనా ఇంటి బయట కనిపించకపోవడంతో చుట్టుపక్కలవారు వారి ఇంటికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో ఉన్నారు. వెంటనే 108లో కరీంనగర్ సివిల్ హాస్పిటల్కు తరలించారు. శంకరయ్య చికిత్సపొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందగా లక్ష్మి ఇంకా అపస్మారకస్థితిలోనే ఉంది. గ్రామస్తులు బుధవారం పోలీసులకు సమాచారమందించడంతో ఎస్సై వంశీకృష్ణ, సీఐ ప్రదీప్కుమార్, రూరల్ ఏసీపీ విజయకుమార్ శంకరయ్య ఇల్లు, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. దంపతులిద్దరూ అపస్మారకస్థితిలోకి వెళ్లడానికి గల కారణాలు, లక్ష్మి మెడలోని పుస్తెలతాడు కనిపించకపోవడంపై లోతుగా విచారణ చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఒంటరిగా ఉంటున్న భార్యాభర్తలను టార్గెట్ చేసి మత్తుమందు చల్లి పుస్తెలతాడు ఎత్తుకెళ్లారా.. లేక ఎవరైనా మత్తు మందు తాగించారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫోరెన్సిక్ రిపోర్టు వస్తే ఏం జరిగిందో తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. శంకరయ్య బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.